కథ

# ఎదురు చూసిన కాముని పున్నమి

- సుభద్రా దేవి

గాయత్రి

**నేను 'కుమారి' నుంచి శ్రీమతిగా పదోన్నతి పొంది కొన్ని గంటలే అయింది. మంచుకురుస్తున్న ఈ తెల్లవారుజామునే గోరువెచ్చని ఆలోచనలను రేకెత్తిస్తూ ఓ హేండ్సమ్ గై నా మెడలో తాళి కట్టేసాడు. ఇరవయ్యేళ్ళు ఇక్కడ పెరిగినా ముందు జీవితమంతా అతనితోనే ముడిపడి ఉందనుకుంటే... ఏదో ఉద్వేగం కలుగుతోంది. అన్నట్టు... ఇవాళ నా ఫస్ట్‌నైట్. ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. పెళ్లితోపాటూ అది కూడా జరిపించేస్తే బాధ్యత తీరిపోతుందని అమ్మానాన్న తొందరపడుతున్నారు. ఆడపిల్లను కన్నవాళ్ళకు అన్నీ తొందరే. పెరట్లో చిన్నకుండీలో ఎంతో ప్రేమగా పెంచుకున్న గులాబీ మొక్కకు అంటు తొడిగినంత సంబరంగా... ఇంట్లో కాళ్ళకు గజ్జెలు కట్టుకుని ఆడిపాడి పెరిగిన ఆడపిల్లను అత్తింటికి పంపించేయాలనుకుంటారు. దానికోసం తెగ ఆరాటపడుతుంటారు.**

కొత్త పరిచయం మొగ్గ తొడిగి స్నేహంగా విరబూయాలన్న భావనే రాదనుకుంటా.

పెళ్లిచూపులు, పెళ్లిపిలుపులు, పెళ్లి... ఇక, తరువాయి శోభనం... అంటూ–

తమకు తెలిసిన ఓ స్క్రీన్‌ప్లే రాసుకుని వరుస సన్నివేశాలతో రక్తికట్టించేస్తారు.

''కాస్తయినా స్థిమితపడకుండా ఆ తంతు జరిపించేయాలా?'' వారిస్తున్నా వింటేనా?

ఓహ్... క్షణం తీరిక లేకుండా ఏర్పాట్లు చేసేస్తున్నారు. అసలే పరిచయం లేని వ్యక్తితో పెళ్లి... ఆ వెన్వెంటనే ఫస్ట్ నైట్. గదిలోకి వెళ్లాలంటేనే భయంగా ఉంది.

దాంతో... ఉదయం దగ్గర్నుంచీ దిగులు.

ఎంత త్వరగా రాత్రయిపోతుందేమోననే బెంగ.

మనోహర్

అంతేనా... ఇంకా ఉంది చూసుకోండంటూ నవ దంపతుల కోసం ఓ గదిని కేటాయించడం, మంచాన్ని, పరుపును రకరకాల పూలతో సింగారించడం, అయ్యవారు పెట్టిన ముహూర్తానికి ఒకటి కమ్మంటూ సంకేతాలు, సందేశాలివ్వడం, తీరా ఆ తంతు ముగించాక... పాపం అలసిసొలసిపోతారేమోననే బెంగతో ముందుగానే ఓ పళ్లెం నిండా స్వీట్లూ, పండ్లూ, ఫలహారాలు ఉంచడం...

ఇన్ని చేసినా... ఇంకా మూడ్ రాకుండా ముడుచుక్కూర్చుంటారేమోనన్న భయంతో కాబోలు...

గదంతా మత్తెక్కే అత్తరు సువాసనలను వెదజల్లడం... అగరొత్తు పొగలతో జాతర చేయడం..!

కేవలం ఇద్దరికి మాత్రమే సొంతమయ్యే 'పెళ్లి' అనే ఏకాంత స్వప్న సామ్రాజ్యంలో ఇన్ని సీన్లు అవసరమా?

తలచుకుంటుంటేనే తల పాతాళంలోకి ఒరిగిపోతోంది. పట్టలేనంత కోపం వచ్చేస్తోంది నాకు.

నలుగురి కళ్లు పడేలా, బాహాటంగా, వైభవోపేతంగా... ఫస్ట్‌నైట్ జరుపుకోవడం నాకైతే అస్సలిష్టం లేదు. ఆ విషయం ఎంత ఖచ్చితంగా ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ విన్పించుకోరేం?

ఆఖరికి... నను కనిపెంచిన అమ్మానాన్నలే నా ఇష్టాయిష్టాలను గుర్తించకపోతే ఎవరికి నా గోడు వినిపించాలి?

అమ్మని కదిపితే తరతరాల ట్రెడిషనంటూ అధిగమించి, అతిక్రమిస్తే మహాపాపమంటూ నానా విధాలుగా హింసిస్తుంది నన్ను.

ఇక, నాన్నయితే... ''ఆచారంరా... తప్పక పాటించాల్సిందే...'' అంటూ క్లాస్ పీకేస్తారు.

ఎంతైనా తెలుగు మాస్టారు కదా!

రెండు మనసులు, రెండు తనువులు కలవాల్సిన వైయక్తిక జీవనోత్సవం సామూహిక సంబరంగా మార్చేస్తే 'డూడూ బసవన్న'లా తలొంచితీరాలా?

ఇష్టంతో ఒకర్నొకరు ఇచ్చిపుచ్చుకోవాల్సిన పవిత్రక్రతువుని అమ్మవారి బోనాల పండుగలా జరిపించేస్తుంటే... కిమ్మనక ఆచరించేయాలా? ఇద్దరూ కలిసి లిఖించాల్సిన నూరేళ్ల సహజీవన సౌభాగ్య సుందర కావ్యంలో ముందుమాటనదగ్గ ఏకాంత రాత్రికి అంతమంది పరోక్ష సాక్షులుండాలా?

'బాబోయ్!' గుండెలపై చేయివేసుకున్నాను.

గాయత్రి

పంచకళ్యాణిలా కాలం పరుగులు తీస్తోంది.

నాకే కనుక శక్తులుంటే.. సూర్యుడిని ఇంటికి వెళ్లనివ్వకుండా వెట్టిచాకిరీ చేయించుండేదాన్ని.

చంద్రుడికి సెలవిచ్చి నచ్చిన నక్షత్రాలతో వేడుక జరుపుకోమనేదాన్ని.

వెర్రిమొర్రి ఆలోచనలకు నాకే నవ్వొస్తోంది.

కొన్ని గంటల్లో ఖచ్చితంగా రాత్రవుతుంది.

చల్లనివెన్నెల కురిపించే చంద్రుడు తప్పక వచ్చేస్తాడు.

తళుకులీనే తారకలూ కొలువుతీరుతాయి.

అలాగే... నస్యం పీల్చుకుంటూ మా ఇంటి పురోహితుడూ వచ్చేస్తాడు.

అర్థం కాని మంత్రాలు వల్లెవేస్తాడు.

తాంబూలం దక్షిణ పుచ్చేసుకుని... 'ఇక, అమ్మాయిగారిని గదిలోకి పంపించండ'ంటూ హుకుం జారీ చేసేస్తాడు.

ఇంటికొచ్చిన ఇరుగుపొరుగు అమ్మలక్కల్లో కొందరు నాపక్కకు చేరి తలంతా పూలతోటను చేసేస్తారు. తెల్లచీరిచ్చి వయసుపరువాన్ని పొట్లంలా బిగించి కట్టుకోమంటారు.

అప్పటితో కథ మొదలు.

వయసుపండిన కొందరు ముత్తయిదువులు ఎప్పుడో తమ పెళ్ళిళ్లయిన కొత్తల్లో వచ్చిన మొదటిరాత్రుల్ని తలచుకుని నవ్వులు రువ్వుతుంటారు. ఆకతాయి మొగుళ్ల అల్లరల్లరి చేష్టలను కహానీలుగా చెప్పుకుని మురిసిపోతుంటారు. అంతేనా? చుట్టుపక్కలా, చుట్టాలు పక్కాల్లో

ఉన్న కొత్తగా పైటేసిన కన్నెపిల్లలు ఇలాంటి కలల రాత్రి తమ జీవితాల్లోకెపుడెపుడొస్తుందా? అనుకుంటూ అంగలార్చి చొంగ కార్చుతుంటారు. ఇంకా పెళ్లిళ్లు కాని నా ఈడు పిల్లలైతే మరీనూ... లైట్లారిన మరుక్షణం గదిలో జరగబోయే సన్నివేశాలను ఎవరికి తోచినట్లు వారు ఊహించుకుని నిట్టూర్పుల సెగలు విడుస్తుంటారు.

జంటయ్యామని ఒంటరివాళ్లను వేధించడం అంతవసరమా?

భరించలేకున్నాను.

**మనోహర్**

నిజానికి పెళ్లి- ఓ పర్సనల్ సెలబ్రేషన్.

జీవితంలో అనివార్యంగా జరగాల్సిన వేడుక. 'తోడొకరుండినా.. అదే భాగ్యమనుకో'దగ్గ పండుగ.

'నా వేలు పట్టుకుని నావెంటొస్తే... జంటనేనై లోకాలు చూపిస్తా..' అనే సూత్రానికి మంగళసూత్రాలే మౌనసాక్షులు.

వేదమంత్రాల సాక్షిగా గాయత్రి నా లైఫ్‌లోకి ప్రవేశించింది. చూసీచూడగానే నెక్స్ట్ డోర్ గాళ్‌లా కనిపించే గాయత్రి పెళ్లిచూపులనాడు తొలిచూపులోనే నన్నాకట్టుకుని కనికట్టు చేసింది. టెన్నిస్ కోర్టులోని సానియా, థియేటర్లలో అసిన్ అందాలెన్ని విరజిమ్మినా ఏమాత్రం లయతప్పని గుండె గాయత్రిని చూడగానే వేగంగా, ఉద్వేగంగా కొట్టుకుంది.

'గాయత్రి ఇపుడు నా అర్ధాంగి...' అనుకుంటే ఎంతో ఆనందం కలుగుతోంది.

'పెళ్లయింది.

వెన్వెంటనే జరిగే ఫంక్షనేంటో తెలుసా?' ఫ్రెండ్స్ అడుగుతుంటే... ఎలర్టయ్యాను.

ఫస్ట్‌నైట్ కోసం అపుడే హడావుడి మొదలెట్టేసినట్లున్నారు.


ఈ హడావుడి చూస్తున్న నాకైతే ఎలా అనిపిస్తుందో తెలుసా..?

''ఇదిగో... నాకు వయసొచ్చింది. జత కట్టక తప్పదనీ పెళ్లి చేసినట్లు... ఆ కార్యమేదో తొందరగా జరిపించేసుకుని కించిత్ శాంత పడమని...తెల్లచీరలో, పాలగ్లాసుతో నా గదిలోకి ఓ అమ్మాయిని పంపిస్తున్నట్లు తోస్తోంది. రాత్రేం జరుగుతుందో మీ అందరికీ తెలిసిందే కదా! గది లోపల అదే చేస్తామని ఊహించుకోండి...'' అంటూ నాకునేనే పబ్లిక్ స్టేట్‌మెంటిస్తున్నట్లనిపిస్తోంది. పెళ్లయిన ఓ ఆడది తన సంపూర్ణ కన్యత్వాన్ని మడుపు కట్టి ఈ రోజే తాళి కట్టిన మొగుడికి అర్పిస్తోందంటూ చాటింపు వేసినట్లుంటోంది.

ఎట్‌ది సేమ్ టైమ్...తన పాతికేళ్ల బ్రహ్మచర్యాన్ని ఈ రాత్రి వదిలేస్తున్నాడంటూ డప్పు కొట్టి చెప్పినట్లుంటుంది... ఈ సంబరాన్ని చూస్తుంటే. ఓ ఆడామగా ఇష్టపడి చేసుకోవాల్సిన సృష్టి కార్యాన్ని, నూరేళ్ల జీవిత సౌభాగ్య శోభనాన్ని ఓ 'కర్టెన్‌రైజర్'గా మార్చేయడం సమంజసమా?

పెళ్లి చేసుకున్న దంపతుల నడుమ ఆకర్షణ తప్పనిసరి. ఆ కెమిస్ట్రీ అత్యంత సహజంగా ఆవిష్కరించుకోవాలే తప్ప అరువు తెచ్చుకున్నట్లుండకూడదు. పదిమందీ చుట్టూ చేరి ఓ గదిలోకి నెట్టేసి కృత్రిమంగా కల్పించిన ఏకాంతంలో ఇక... మీ పాట్లు పడండంటూ దిలేయడం సబబనిపించడం లేదు. గదిలోపల ఇద్దరే ఉన్నా... వెలుపల తమని గమనించే, తమగురించే ఆలోచించే ఎందరో ఉన్నారనే భావనే కలుక్కుమంటూ గుచ్చుకుంటుంది.

ప్రియనేస్తం సమక్షాన్ని హాయిగా, ఆనందంగా గడపాలే కానీ... ఎవరో చూస్తున్నారని క్షణక్షణం తలచుకుంటూ అప్రమత్తంగా ఉంటే నరకం



కాదా? వయసులో ఉన్నవారు ఒకరి సన్నిధిలో ఒకరు గడపాలనుకోవడం, తమకంగా చూసుకోవడం, తనివితీరా తాకాలనుకోవడం, అడపాదడపా ఆలింగనం చేసుకోవడం, ఎంగిలి ముద్దులిచ్చి పుచ్చుకోవడం, సగంసగం దేహాల, విరహతాపాల సందేహాలు తీర్చుకోవాలనుకోవడం... అన్నీ వర్షంలో తడిసి ముద్దయినంత థ్రిల్‌లా అతి సహజంగా అందుకోవాలి.

ఓ రాత్రి వెన్నెల్లో స్నానిస్తూ లాంగ్‌డ్రయివ్ చేస్తున్నంత అపురూపంగా అనుభవాలను మూటగట్టుకోవాలి.

అంతేకానీ... అందరికీ ఇన్‌ఫర్మేషన్, ఇన్విటేషనిచ్చి జీవితంలో మొదటిరాత్రి మొదటి ఆట వేయకూడదు. కదూ!

## అసలు కథ

కొత్త పెళ్లికూతురు బుగ్గ సిగ్గులా ఆకాశానికింత సింధూరం పూసి... ఆరోజు కొలువైపోయిందంటూ గుడ్‌బై చెప్పేసాడు సూరీడు. సంకేతస్థలంలో ఏకాంత ప్రేయసి ముద్దులొలికే ముక్కుకు ప్రియవిభుడు మనసారా చేయించిచ్చిన ఎంచక్కని ముక్కెరలా ఒంటరి నక్షత్రం తళుక్కుమంటోంది.

''ఏర్పాట్లు పూర్తయ్యాయా?'' బామ్మ అరుపు లోనుంచి.

''కార్యం పూర్తయ్యే వరకూ ఈ ముసల్ది వదిలేలా లేదు. మర్నాడూ కట్టుకున్న తెల్లచీర మడత నలిగిందా, లేదా... అని పరీక్ష చేసేట్టే ఉంది దాని వాలకం...'' కోపంతో తిట్టుకుంటోంది గాయత్రి.

''అమ్మా... గాయత్రీ!'' బామ్మ పిలుపు వినిపించినా వినిపించుకోనట్లు నటిస్తోంది.



ఇంతలో–

''ఏమే... అంత గొంతేసుకుని నానమ్మ పిలుస్తుంటే... పలకవేం? నీకంటూ ఓ మొగుడు రాగానే చెముడొచ్చిందేమిటే?'' గట్టిగా గద్దించింది అమ్మ.

''ఎందుకు పిలుస్తుందో వెళ్లి కనుక్కో... నీ పెళ్లి చూడాలని ఎన్నేసి కలలు కందో ఆ ముసలి ప్రాణం. ఆఖరికి పెద్దజబ్బొచ్చి ఆ యముడు కొరడా ఝుళిపించినా.. రానని భీష్మించుకూర్చుంది. కొన్నాళ్ల తర్వాత ఈ ఆప్యాయతలు కోరుకున్నా అందించేవారే ఉండరు...'' నసుగుతోంది అమ్మ.

''అబ్బ... వెడుతున్నానుగా.. నసగకు..'' అమ్మని కసురుకుంటూనే నానమ్మ దగ్గరికి వెళ్లింది గాయత్రి.

''రా... గాయత్రీ! ఇలా కూర్చో...'' అంటూ ఆత్మీయంగా గాయత్రి రెండు చేతులూ పట్టుకుని ముద్దాడింది నానమ్మ.

''నీ చేతుల్లో గోరింట బాగా పండుతుందే... బాగా పండితే మా మాంఛి మొగుడొస్తాడని ఊరికే అన్నారా? చిన్నపుడు నా చేతుల్లో ఆడి పాడిన పసికూన అపుడే పెరిగి పెద్దదై పెళ్లికూతురై ఓ ఇంటిదైపోయింది. రేపోమాపో పండంటిపాపని కనేసి నా చేతుల్లో పడేస్తే... ఆ చంటిదాన్ని చూసుకుంటా...''

''దాన్నీ పెంచి, పెద్ద చేసి ఓ అయ్యవారి చేతుల్లో పెట్టి... అదీ ఓ పాపను కంటే... మళ్లీ ఎత్తుకుని.. ముద్దాడి, మురిసిపోయి...'' ఆయాసం తీర్చుకునేందుకు ఓ క్షణమాగింది గాయత్రి.

''అంతకుమించిన కోరికలేం ఉండవా, బామ్మా! ఎపుడో చిన్నతనంలోనే తాతయ్య చనిపోతే... ఒంటి చేత్తో నాన్నని పెంచి పెద్దచేసావు. ఓ ఇంటివాడిని, ఇంతవాడిని చేసావు. నా వంటి మీద ఈగవాలకుండా ఎంతో ప్రేమగా ఎత్తుకుని పెంచావు. ఇపుడు... నా పెళ్లి కళ్లార చూసి... మళ్లీ నా కడుపున ఓ కాయ కాస్తే చూడాలని కలలు కంటున్నావ్. మా చుట్టే నీ జీవితాన్ని అల్లుకున్నావ్..'' నానమ్మని గాఢంగా కౌగిలించుకున్న గాయత్రి కన్నీరుమున్నీరే అయింది.

''ఊరుకో... శోభనంవేళ కన్నీళ్లు పెడతారా ఎవరైనా? చూడు... ముఖమంతా కాటుక మరకలు'' గాయత్రి రెండుకళ్లనూ చీరకొంగుతో తుడుస్తూ ఓదారుస్తోంది ఆవిడ.

''అసలు... నిన్నిపుడు ఎందుకు పిలిచానంటే...'' అంటుంటే... మనోహర్ అక్కడికి చేరుకున్నాడు. ఆయననక్కడ చూడగానే గాయత్రి సిగ్గు మొగ్గే అయ్యింది. రెండు చేతుల మధ్య ముఖాన్ని దాచుకుని నానమ్మ ఒడిలో పసికూనలా ఒదిగిపోయింది.

''బామ్మగారూ పిలిచారట..''

''అవున్నాయనా.. ఏదో పెద్దదాన్నీ.. మీ

ఇద్దర్నీ దగ్గరగా ఓసారి చూడాలనిపించి... ఇలా పిలిచాను... తప్పుగా అనుకోకు''

''ఇందులో తప్పేముంది? మా బామ్మే మీరూనూ..'' అన్నాడు మనోహర్ అక్కడే చతికిల పడి కూర్చుంటూ.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి.

వాకిట్లోంచి నైట్‌క్వీన్ పరిమళం గదిలోకి అందర్నీ మత్తుగా పలకరిస్తోంది.

''మీ ఇద్దరూ వినండి. ఏదో పెద్దదాన్ని నాకు తోచిన నాలుగు మాటలు చెబుదామనుకుంటున్నాను. కాస్త చాదస్తంగా ఉండొచ్చేమోగానీ... జీవితానికి పనికొచ్చేవి. వింటున్నావా, గాయత్రీ!'' మురిపెంగా బుగ్గను చిదుముతూ అడిగిందావిడ.

'వింటున్నా'నన్నట్లుగా తలూపింది గాయత్రి.

''మొగుడూపెళ్లాలు బతుకుబండికి రెండు చక్రాలు. ఏ చక్రం గోతిలోపడ్డా బండి ముందుకు నడవదు. వయసు ఆకర్షణకొద్దీ మొదట్లో ఏ గొడవలు రాకున్నా.. ఇద్దరూ వేర్వేరు ప్రాంతాలు, కుటుంబాలనుంచీ, వేర్వేరు పరిస్థితుల్లో పెరిగి పెద్దయ్యాక పెళ్లి పేరుతో ఒకటవుతున్నవారు. ఎంత ఒకటనుకున్నా వ్యక్తులుగా ఇద్దరవడం, మనుషులుగా ఆలోచనాపరులవడం, తమదైన వ్యక్తిత్వం నిలుపుకోవాలనుకుని తాపత్రయపడడం... తర్వాత్తర్వాత జీవితంలో అభిప్రాయభేదాలుగా పొడసూపుతుంటాయి. అభిప్రాయభేదాలను అంతవరకే ఉంచుకోండి. కాపురాన్ని వీధిలో పడేసేదాకా, తెగేదాకా లాక్కండి. మీ ఆయనకు కోపం వస్తే నువ్వు కాస్త తగ్గు... అలాగే... నీక్కోపం వస్తే... నాయనా.. నీకన్నా కాస్త చిన్నదని గమనించి గుండెల్లో పెట్టుకో... మా గాయత్రి పెళ్లి చూడాలనే ఇంతకాలం బతికున్నాను... ఇంకెంత కాలం బతుకుతానో నాకు తెలీదు..''

''అలా అనకే బామ్మా...'' చటుక్కున ఆవిడ నోరు మూసేసింది గాయత్రి.

''అలా అనకండి..'' మనోహర్ మాటలు గాయత్రి మాటల్లో కలిసిపోయాయి.

''ఇదే నాయనా.. నేను కోరుకుంది. ఇద్దరి మాట, బాట, గమ్యం ఒకటే కావాలనుకుంటున్నాను... ఇలా ఒకటిగా కలిసిమెలిసి ఉండండి. ఇదే నా దీవెన..'' అందావిడ.

***గంట తర్వాత-***

తెల్లచీరలో అందంగా ముస్తాబైన గాయత్రిని అందరూ కలిసి గదిలోకి తోడ్కొని వెడుతుండగా... సరిగ్గా, అపుడే- దూరంగా మరోగదిలోనుంచి పెద్ద కేక వినిపించింది. ఆ కేక గాయత్రి నానమ్మదే. ఒక్కసారిగా అందరూ హడలిపోయారు. ఏం జరిగిందోననుకుంటూ అంతా అక్కడికి చేరుకున్నారు. అయితే... అప్పటికే ఆమె ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఒక్కసారిగా ఆ ఇల్లు శోకసంద్రమైపోయింది.

గాయత్రి అమ్మానాన్నలు శవంపై పడి రోదిస్తున్నారు. విషయం తెలిసిన మనోహర్ అక్కడికి చేరుకున్నాడు. గంటకిందట... చక్కగా కాపురం చేసుకోమని ఇద్దర్నీ నిండుమనస్సుతో దీవించిన పెద్దావిడ అంతలోనే లోకం నుంచీ సెలవు తీసుకోవడం అతడినెంతగానో కృంగదీసింది.

ఓ స్తంభాన్నానుకుని విషాదాన్ని మౌనంగా దిగమింగుతున్న గాయత్రి దగ్గరకు చేరుకున్నాడు మనోహర్. నెమ్మదిగా చేతులు సాచాడు. ఓదార్పు కోసం ఎదురుచూస్తున్న గాయత్రి చటుక్కున అతని ఎదపై వాలిపోయింది. ''నీకు నేనున్నాన''నే ధైర్యం చెబుతూ హృదయానికి హత్తుకున్నాడు. అతని విశాలమైన ఛాతీపై తలానించి ఏడుస్తూనే ఉంద గాయత్రి. అంతమందిలో... ఆ ఇద్దరూ అలా ఒకటిగా... ఒకరికౌగిలిలో ఒకరు..

బహుశా.. గాయత్రి నానమ్మ కోరికా అదేనేమో?

**ముక్తాయింపు**

నెల్లాళ్ల తర్వాత, ఊటీలో--

శీతలపవనాలు జోరుగా వీస్తున్న ఒకానొక సాయంసమయాన-

ఆ ఇద్దరూ పక్కపక్కన నడుస్తున్నారు. అతని భుజంపై ఆమె శిరసానించింది. అతని చేతులు ఆమె నడుముని చుట్టుకున్నాయి.

చలిగాలులు చురకత్తుల్లా విజృంభిస్తున్నా... వారికి లెక్కే లేదు.

ఒకరిపక్కన ఒకరుంటే... ఫైర్ ప్లేస్ పక్కనున్నంత వేడి, శరీరాల్లో ఒకటే అలజడి. హడావుడి.

ఒకరినొకరు చుట్టేసుకుంటుంటే దుప్పట్లూ, రగ్గులూ అవసరం లేని స్థితి.

అతనన్నాడు- ''పరిచయమే లేని ఈ కొత్త ఊర్లో భయమనిపించడం లేదూ''

''ఊహూ..!''

''పరిచయమే అసలే లేని నాతో కలిసి నడిచే ఓ సాయంత్రం వస్తుందని ఊహించావా?''

''ఊహూ..!''

''ఇపుడేమనిపిస్తోంది నీకు..''

''ఈ సాయంత్రమిలా... ఇక్కడే ఆగిపోవాలని. మనమిద్దరం ఇలా హత్తుకుంటూ... అనంత దూరాలవరకూ సాగిపోవాలని... ఆకుపచ్చని ప్రకృతిలో ఆకులో ఆకులా... కలిసిపోవాలని... ఒకరిలో ఒకరు కరిగిపోవాలని..'' చెబుతోంది గాయత్రి. అంతే! ఒక్కసారిగా బిగియారా కౌగలించుకున్నాడు. శరీరాన్ని వీణతీగెలా మలచుకున్నాడు. అణువణువూ స్పృశిస్తూ ముద్దు సంతకాలు చేస్తున్నాడు. వెచ్చని ముద్దు తడికి తను



వంతా పులకింతలకు లోనవుతోంది. అవును -జీవితంలో వారెన్నడూ ఎదురు చూడని కాముని పున్నమి ఇదే. ముహూర్తాలకు అందని ముద్దూముచ్చట్ల ప్రణయం ఇదే. తిథివారనక్షత్రాలతో పనేలేని ప్రేమా ఇదే.

ఎవ్వరూ లేని ఆ ఏకాంత సీమలో... సృష్టిలోని ప్రేమంతా జుర్రుకునే వెర్రిప్రయత్నంలో ఆ ఇద్దరూ సంగమిస్తున్నారు.

ఏ శరీరమెవరిదో తెలియనంతగా ఒకర్నొకరు సమాదరిస్తున్నారు. రహస్యలోకాలదారులు వెతుకుతూ సాగిపోతున్నారు. ఆకాశంలో జాబిల్లి చల్లని కిరణాలతో వారిని అభిషేకిస్తున్నాడు. అంతే!

☆

## తమన్నకి కోలీవుడ్ అంటే...?!

మిల్కీ వైట్ బ్యూటీకి కోలీవుడ్ అంటే ఇష్టమట! కోలీవుడ్ హీరోలు బాగా 'కో ఆపరేట్'గా ఉంటారని కూడా వారికి కితాబులిచ్చేస్తోంది. 'హ్యాపీడేస్'తో తెలుగుప్రేక్షకులను ఓ ఊపు ఊపిన తమన్న అదే ఊపుతో కోలీవుడ్ వైపు దూసుకుపోయింది. మధ్య మధ్య అరకొరా తెలుగు సినిమాలు చేస్తున్నా తన దృష్టి అంతా కోలీవుడ్ వైపే సారించింది. కోలీవుడ్, టాలీవుడ్ తారలు బాలీవుడ్ బాట పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తమన్న మాత్రం తాను బాలీవుడ్‌కి వెళ్లే ప్రసక్తే లేదని తెగేసి చెబుతోంది. ఇదంతా కోలీవుడ్ మీద ఉన్న ప్రేమ కాదని కొందరు కొట్టి పారేస్తున్నారు. కోలీవుడ్ హీరోయిన్లు అందరూ బాలీవుడ్‌కి తరలిపోతుండగా, అక్కడ తమన్నకు డిమాండ్ ఎక్కువైందని, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా తమన్న ఇప్పుడు ఎడాపెడా చిత్రాలను అంగీకరించేస్తోందని వారు అంటున్నారు.